ప్రజాశక్తి
సోమవారం 30 అక్టోబర్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఆక్రమణకు గురైన స్థలం

'రాళ్లవాగు'లో రాబందులు

▶ 8లో

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆపార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వైసిపి ప్రభుత్వానికి 'కళ్లుతెరిపిద్దాం' కార్యక్రమంలో ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తన నివాసంలో కళ్ల కు గంతలు కట్టుకొని కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-ఒంగోలు

నీరులేక.. మొక్కలు ఎండి..

- వర్షాభావంతో వాడుతున్న పొగనారు
- కాపాడుకొనేందుకు అవస్థలు
- రైతులపై ఆర్థిక భారం

నీరు లేక వాడు మోహం పెట్టిన పొగ మొక్కలు

ప్రజాశక్తి-కొండపి

గతేడాది పొగాకు ధరలు ఆశాజనంగా ఉన్నాయి. ఆ ధరల నుంచి ఈ ఏడాది పొగాకు సాగు రైతులు ఆసక్తి చూపారు. పొలాలు, బ్యారన్లను అధిక ధరలకు కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేశారు. వాతావరణం ఆదిలోనే ప్రతికూలంగా మారింది. వర్షాభావ పరిస్థితుల పరిస్థితుల కారణంగా రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. బురదలో పొగాకు నాట్లు వేయాల్సిన సమయంలో నీరు పోసి మొక్కలు నాటాల్సి వస్తుంది. ఫలితంగా రైతులపై ఆర్థిక భారం పడుతోంది. ఈ పాటికే నాటిన మొక్కలు నీరు వాడిపోతున్నాయి. వాటిని కాపాడుకోవడానికి రైతులు అనేక అవస్థలు పడుతున్నారు.

290 హెక్టార్లకే అనుమతి

కొండపి పొగాకు వేలం కేంద్ర పరిధిలోని కొండపి, మర్రిపూడి, జరుగుమల్లి మండలాల్లోని 45 గ్రామాలు ఉన్నాయి. ఈ ఏడాది పొగాకు బోర్డు కొండపి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 5,876 హెక్టార్లలో పొగనాట్లకు అనుమతి ఇచ్చింది. ఈ లెక్కన 290 హెక్టార్లల్లో మాత్రమే పొగనాట్లు వేయాల్సి ఉంది. ఈ పాటికే సుమారు 150 హెక్టార్లలో పొగాకు నాట్లు వేయాల్సి ఉంది. అయితే లైట్ సాయిల్ భూముల రైతులు మాత్రమే పొగనాట్లు వేశారు. అయితే 20 శాతం ఎండుముఖం పట్టాయి. వాటిని కాపాడు కొనేందుకు రైతులు అనేక వ్యయప్రయాసలకు ఓర్చి భగీరథ యత్నం చేస్తున్నారు.

పెరిగిన పెట్టుబడులు

గత ఏడాది వచ్చిన లాభాలు దృష్టిలో ఉంచుకొని రైతులు ఈ ఏడాది ఒక్కొక్క బ్యారన్‌ను రూ.1.20లక్షల నుంచి 1.50 లక్షల వరకూ కౌలుకు తీసుకున్నారు. నల్లరేగడి భూములను ఎకరాకు రూ.25 నుంచి 30 వేల వరకు కౌలుకు తీసుకున్నారు. వర్షాలు పడతాయని ఆశతో కొందరు రైతులు పొగ మొక్కలు నాటారు. మరికొంద కొంత మంది పొలాలను దునర్ని మందు చల్లి ఉంచారు. వర్షాలు పడితే నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

రెండు రకాల నేలలు

కొండపి పొగాకు వేలం కేంద్రం పరిధిలో ఎర్రనేలలు, నల్ల రకం నేలలు ఉన్నాయి. ఎర్రనేలలకు సంబంధించిన రైతులు ఈపాటికి పొగనాట్లు వేయాల్సి ఉంది. కొద్ది మంది రైతులు మాత్రమే నాట్లు వేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వాటిని కాపాడ ుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇప్పటికి పొగాకు నాట్లుకు రూ.20 వేలు ఖర్చు

పొగాకు నాట్లు వేసేందుకు ఈ పాటికే ఎకరానికి సుమారు రూ.20వేల పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు. దున్నకానికి రూ.2వేలు, రెండు సార్లు గొర్రుతోలినందుకు రూ.2100, పొలం మందుకు రూ.4000, అచ్చుతోలినందుకు రూ.1600, పొగాకు నారు కొనుగోలుకు రూ.3000, నాట్లు వేసేందుకు కూలి రూ.3500, మొక్కలు వేసేందుకు నీళ్లట్యాంకుల ఖర్చు రూ.3000 కలిపి మొత్తం రూ.20వేలు అయినట్లు రైతులు చెబుతున్నారు. నాట్లు వేసిన తర్వాత వర్షాలు పడక పోవడంతో వాటిని ▶ 2లో

వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొడదాం

- 1 నుంచి ఇంటింటికీ ప్రచారం
- ప్రజలను చైతన్యపరిచేందుకు చర్యలు
- ఉమ్మడి ప్రకాశం టిడిపి - జనసేన నేతల నిర్ణయం
- పలు తీర్మానాలు ఆమోదం

సమావేశంలో పాల్గొన్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజా వ్యతిరేక ప్రభుత్వం వైసిపిని తరిమికొట్టాలని, వైసిపి అక్రమాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు నవంబర్ 1 నుంచి ఇంటింటికి ప్రచారం చేపట్టాలని టిడిపి – జనసేన పార్టీల నేతలు నిర్ణయించారు. స్థానిక ఎంఎస్ ఫంక్షన్ హాలులో ఉమ్మడి ప్రకాశం జిల్లా టిడిపి – జనసేన పార్టీ నేతల సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశానికి టిడిపి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి, జిల్లా పరిశీలకులు దేవినేని ఉమా మహేశ్వరరావు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టిడిపి – జనసేన పార్టీ ఆవశ్యకతను ప్రజలలో వివరించటం, అరాచక వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించటానికి అమలు చేయాల్సిన ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక, టిడిపి సూపర్ సిక్స్, జనసేన పార్టీ వ్యూహాలను ప్రజలలో ప్రచారం చేయాలని తీర్మానించారు. అనంతరం పాత్రికేయులతో టిడిపి జిల్లా పరిశీలకులు మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ అరాచక, అప్రజాస్వామిక వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు టిడిపి–జనసేన పార్టీలు నిర్ణయించటం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు చేశారన్నారు. 14 ఏళ్లు ముఖ్య మంత్రిగా పనిచేసిన వ్యక్తికి బెయిల్ రాకుండా వ్యవస్థలను మేనేజ్ చేస్తూ రాక్షస ఆనందనం పొందుతున్నారన్నారు. వైఎస్.వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డి నిందితుడిగా సిబిఐ గుర్తించినా అరెస్టు చేయకుండా సిఎం ▶ 2లో

నీరులేక.. మొక్కలు ఎండి..

(మొదటిపేజీతరువాయి)

బతికించడానికి మోటారు ద్వారా నీరు సరఫరా చేసేందుకు రోజుకు రూ.4000, పైపుల బాడుగ రూ.1000 వరకూ ఖర్చు అయినట్లు రైతులు తెలిపారు.

ఆరున్న ఎకరాల్లో పొగనాట్లు వేశా

మామిళ్లపల్లి వేణు, రైతు, కట్టావారిపాలెం

ఆరున్న ఎకరాల్లో పొగనాట్లు వేశా. ఎకరానికి సుమారు రూ.20వేల వంతున రూ.1.30 లక్షల పెట్టుబడి పెట్టా. వర్షాలు లేకపోవడంతో మొక్కలు వాడుమోహం పెట్టాయి. వాటిని కాపాడుకొనేందుకు ఎకరాకు రూ.5 వేల వంతున ఖర్చు చేయాల్సి వస్తుంది. అయినప్పటికీ పంట చేతికందుతుందో లేదో అర్థం కావడం లేదు.

వైసిపి ప్రభుత్వాన్ని తరిమి కొడదాం

(మొదటిపేజీ తరువాయి)

జగన్ రెడ్డి అడ్డుకున్నారన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ టిడిపి- జనసేన కలయికపై ప్రజలను చైతన్యం చేయటానికి ఉమ్మడి సమన్వయ సమావేశం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను బాధపెడుతుందని, భారాలు మోపి వేధిస్తుందన్నారు. కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలాశ్రీబాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందన్నారు. గతంలో ఉన్న సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి జగన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. అనంతరం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధనరావు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడారు.

పలు తీర్మానాలు ఆమోదం

టిడిపి జనసేన సమన్వయ కమిటీ సమావేశంలో 12 తీర్మానాలను ఆమోదించారు. తాగునీరు, సాగునీరు అందించే వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణంలో పురోగతి లేదని, టిడిపి-జనసేన ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో పూర్తి చేసి మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని తీర్మానించారు. గుండ్లకమ్మ, సంగమేశ్వర, కొరిశపాడు ప్రాజెక్ట్‌లు, గుంటూరు ఛానల్ పర్చూరు వరకూ పొడిగింపును నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని తీర్మానించారు. మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని, కందుకూరు రెవెన్యూ డివిజన్‌ను, అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో చేర్చాలని తీర్మానించారు. ఒంగోలు, మార్కాపురం, కనిగిరిలో దొంగపట్టాలు, భూకబ్జాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్, చీరాల ఇన్‌ఛార్జి ఎంఎం.కొండయ్య, వై.పాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, కందుకూరు ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్, రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు, క్రియాశీలక సభ్యుల శిక్షణ తరగతుల చైర్మన్ ఈదర హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలుట్లకు రోడ్డేదీ..!!

దశాబ్ధాలుగా రోడ్డు కరువు..!!
గిరిజనులకు తప్పని అవస్థలు
దక్కని అటవీ శాఖ అనుమతులు ..
ఇబ్బందిపడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నల్లమల అడవి ప్రాంతంలోని పాలుట్ల గిరిజన గూడెంకు దశాబ్ధాలుగా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. దీంతో గిరిజనులకు విద్యా, వైద్యం సక్రమంగా అందడం లేదు. నల్లమల అటవీ ప్రాంతంలోని గిరిజన గూడేల్లో ఐటిడిఎ పరిధిలో ఆశ్రమ పాఠశాలలు నిర్వహిస్తున్నారు. రోడ్డు సౌకర్యం లేక ఉపాధ్యాయులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా పాలుట్ల, అల్లిపాలెం, దద్దనాల గిరిజన గూడెంలలో ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. రోడ్డు లేవనే కారణంతో దద్దనాల, అల్లిపాలెం ఆశ్రమ పాఠశాలలను గంజివారిపల్లి పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌కు మార్చారు. పాలుట్లలో ఆశ్రమ పాఠశాల నిర్వహిస్తున్నారు. పాలుట్ల గిరిజన గూడెం, దాని పరిసరాల్లో నెక్కంటి, తెలుగురాయుని చెరువు, గుట్టలచేను, నారుతడికల అన్నిచోట్ల కలిపి 2000 పైగా గిరిజనులు నివాసముంటున్నారు. రోడ్డు సౌకర్యం ఉన్నా లేకపోయినా అక్కడి వాతావరణానికి అలవాటుపడిన గిరిజనులు పాలుట్ల గిరిజన గూడెంను వీడి మైదాన ప్రాంతాలకు వచ్చేందుకు ఇష్టపడడం లేదు.

పాలుట్లకు వెళ్లే రహదారి

2012లో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పాలుట్ల గిరిజన గూడెంనకు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద 38 కిమీ పొడవునా గ్రావెల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.16.90 కోట్లు మంజూరు చేయించారు. కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. నిధులు మంజూరైనా ఉపయోగం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఐటిడిఎ అధికారులు, రాష్ట్ర గిరిజన కమిషనర్ కార్యాలయం అధికారులు పర్యటించిన సమయంలో అనుమతులు తెచ్చి రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పినప్పటికీ సాధ్యపడలేదు. పాలుట్ల గిరిజన గూడెంనకు యర్రగొండపాలెం నుంచి వెళ్లడానికి జీపులతోనే సాధ్యం. రానుపోనూ 8 గంటలు సమయం పడుతుంది. పాలుట్ల గిరిజన గూడెం పేరుతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా దాన్ని గంజివారిపల్లిలో నిర్వహిస్తున్నారు. డాక్టర్లు నెలకు రెండు పర్యాయాలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ మధ్యలో జ్వరాలు వచ్చినా, ఏదైనా ప్రమాదాలు జరిగినా యర్రగొండపాలెం లేదా దోర్నాల వెళ్లి చికిత్స పొందుతున్నారు. పాలుట్లను నూతన పంచాయతీగా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ రహదారి సౌకర్యం సమకూరలేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పాలుట్ల గిరిజన గూడెంనకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని పాలుట్ల గిరిజనులు కోరుతున్నారు.

గిరిజన మహిళను డోలిలో మోసుకెళ్తున్న దృశ్యం

38 కిమీ రోడ్డు లేక అవస్థలు

కొండలు, పునరావాస కాలనీ

పాలుట్ల గిరిజన గూడెం వెళ్లాలంటే గంజివారిపల్లి నుంచి 38 కిమీ దూరం దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో ప్రయాణం చేయాల్సి ఉంది. రోడ్డు సౌకర్యం లేని కారణంగా కొండలు, గుట్టలు ఎక్కుతూ, దిగుతూ సుమారు పది గంటలు పాటు నడిచి వెళ్లాల్సి వస్తోంది. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడక తప్పడం లేదు.

సర్వే చేసినా అనుమతులు రాలేదు

చెవుల అంజయ్య, మాజీ సర్పంచి, వెంకటాద్రిపాలెం

పాలుట్ల గిరిజన గూడెంనకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గత 20 సంవత్సరాలుగా కోరుతున్నాం. ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నాం. 2013 సంవత్సరంలో రూ. 5 లక్షలు ఖర్చు చేసి సర్వే చేశారు. అయితే ఫారెస్టు అనుమతులు రాక రోడ్డు నిర్మాణం జరగలేదు.

మట్టి రోడ్డు అయినా ఏర్పాటు చేయాలి

నిమ్మల ఈదన్న, విటిడిఎ ప్రెసిడెంట్, పాలుట్ల

పాలుట్ల గిరిజన గూడెంలో పండించిన పంటలు విక్రయించుకునేందుకు, ఆపద సమయంలో వేగంగా యర్రగొండపాలెం, దోర్నాల ప్రాంతాలకు వాహనాల ద్వారా తరలి వెళ్లేందుకు కనీసం మట్టి రోడ్డైనా నిర్మించాలి. దట్టమైన చెట్ల మధ్య వెళ్లడానికి చాలా ఇబ్బందికరంగా ఉంది.రహదారి సౌకర్యం కల్పిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

డబుల్ రోడ్డు కోసం ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-పామూరు

పట్టణంలోని నెల్లూరు రోడ్డు మయూరి లాడ్జి నుంచి హైవే వరకు ఉన్న ఆర్అండ్‌బి రోడ్డు సింగల్ రోడ్డు వేయడంతో గతంలో అనేక ప్రమాదాలు జరిగినట్లు పట్టణ రెండో ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ అన్నారు. వివిధ సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా జరిగాయని ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. నెల్లూరు రోడ్డు నుంచి జాతీయ రహదారి 565 వరకు డబుల్ రోడ్డు వేయాలని కనిగిరి శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్‌కు పామూరులో జరిగిన పోలీసు అమరవీరుల కార్యక్రమంలో ఆకుపాటి మిత్ర బృందం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ అతి త్వరలో డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీరుకట్టు నాయబ్ రసూల్, ఆవుల నారాయణ, సింగారాజు శివ రావ్, పుప్పాల రామూర్తి, శీలం గురునాథం, వల్లం విజయ్, బాలచారి, ఖాదర్ బాషా, జై చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మద్దిరాల ముప్పాళ్ళ, ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడు తదితర గ్రామాల్లో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా 'నిజం గెలవాలి' 'చంద్రబాబు నాయుడు బయటకు రావాలి' 'సైకో పోవాలి సైకిల్ రావాలి' అంటూ నినదిస్తూ కళ్లు తెరిపిద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ల గ్రామ టిడిపి అధ్యక్షులు మండవ వాసు, ఉప్పుగుండూరు గ్రామ అధ్యక్షులు కాట్రగడ్డ చంద్రబాబు, నాయకులు చుండూరి నాగేశ్వరరావు, గూడూరి ఝాన్సీ, జాగర్ల మూడి కనకయ్య, మురళీకృష్ణ, తగిరశ వెంకట్రావు, వెంకటేష్, అశోక్, ఆర్ శ్రీనివాసరావు, కె సెల్వం, కనగాల శ్రీనివాసరావు, బెల్లం వెంకటేశ్వర్లు, నమ్మయ్య, కె సాంబయ్య, పి పోలిరాజు, ఆయా గ్రామాల మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల కన్నా రక్తదానం గొప్పది: బుర్రా

ప్రజాశక్తి-పామూరు

అన్నిదానాల కంటె రక్తదానం గొప్పదని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్‌యాదవ్ అన్నారు. పామూరు సిఐ కె శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అనీల్ గార్డెన్ కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మూరుమూల ప్రాంతమైన పామూరు ఏరియాలో స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి వాటి ద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి సహకరించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా మొత్తం 120 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్‌యాదవ్, వైసిపి నాయకులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, పువ్వాడి రాంబాబు, ఏల్చూరి కొండలరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న దృశ్యం

డాక్యుమెంట్స్ పోయింది

ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం నేకునాంబాద్ గ్రామానికి చెందిన వట్టి పాండురంగయ్య తండ్రి చిన్నసుబ్బరాయుడుకు చెందిన బేస్తవారిపేట మండలం పాపాయపల్లి ఇలాఖాలోని స్థలమునకు సంబంధించిన 1373/2009 నెంబర్ గల డాక్యూమెంట్ కంభం నుండి బేస్తవారిపేటకు బైక్‌పై వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయింది. సదరు డాక్యూమెంట్ దొరికిన వారు ఈ క్రింది అడ్రాస్‌కు తెలియజేయవలసిందిగా కోరుచుతున్నాము.

ఇట్లు
వట్టి పాండురంగయ్య
తండ్రి చిన్నసుబ్బరాయుడు
నేకునాంబాద్ గ్రామం,
బేస్తవారిపేట మండలం,
ప్రకాశం జిల్లా.
సెల్ నెం.9666731869

డాక్యుమెంట్స్ పోయినవి

విశాఖపట్నం జిల్లా విశాఖపట్టణంకు చెందిన కొమ్మన సుహాసిని W/o సుధాకర్‌రావు అనబడే నేను ఈనెల 25న కనిగిరి లోగల మా బంధువులను పరామర్శించటం జరిగింది.అనంతరం మేము కనిగిరి నుండి మా ఊరైన విశాఖపట్టణానికి కనిగిరి డిపో నుండి బయలుదేరి వెళ్తుండగా నందన మారెళ్ల గ్రామ సమీపంలో మా కుటుంబానికి చెందిన స్థలాలకు చెందిన ఒంగోలు సబ్‌రిజిస్టర్ ఆఫీస్ (S.R.NO:818) నందు రిజిస్టర్ కాబడిన 6202/1995,6203/1995, 6204/1995 నెంబర్ కలిగిన డాక్యుమెంట్లు, కందుకూరు సబ్‌రిజిస్టర్ ఆఫీస్ (S.R.NO:809) నందు రిజిస్టర్ కాబడిన 2754/1995, 1105/1995, 1721/1995, 2227/1994 నెంబర్ కలిగిన డాక్యుమెంట్ల ఉన్న ఫైలు మార్గ మధ్యంలో పోయినట్లు గుర్తించాను.పోయిన డాక్యుమెంట్ల కోసం కనిగిరిలోని మా బంధువుల ఇళ్ల వద్ద మరియు పట్టణంలో మేము వెళ్లిన పలుచోట్ల వెతికినప్పటికీ కనిపించలేదు. పైన తెలిపిన డాక్యుమెంట్స్ ఎవరికైననూ దొరికినచో ఈ క్రింది చిరునామాకు తెలియపరచగలరు.

ఇట్లు
కొమ్మన సుహాసిని W/o సుధాకర్‌రావు
ప్లాట్ నెంబర్ : 15, ఫ్లాట్ నెంబర్2/1,
కీర్తన ఎన్నేవ్-2, కిర్లంపూడి లేఅవుట్,
మున్సిపల్ గెస్ట్ హౌస్, విశాఖపట్నం(అర్బన్),
ఎల్బీకాలనీ, విశాఖపట్నం, ఆంధ్ర ప్రదేశ్.
మొబైల్ నెంబర్: 9985485888

మహారాజశ్రీ ఒకటవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో:ఒంగోలు

EA .No.1033/2023
IN
EP.No.82/2022
IN
OS.No.77/2018.

ముత్యాల హిమబిందు ...డి.హెచ్.ఆర్ /ప్లైంటిఫ్
V/s
ఆలూరు సతీష్ ...జె.డి.ఆర్ /రెస్పాండేంట్

ప్రతివాది
ఆలూరి సతీష్, తండ్రి జాలయ్య,
వయస్సు 34 సంవత్సరాలు,
ఇంటి నెంబర్.20-3-3,
మంగలిపాలెం, ఒంగోలుటౌన్,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలో శ్రీకోర్టు వారు మీకు అనేక పర్యాయములు నోటీసులు పంపగా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు నీకు నోటీసు నిమిత్తం 20-11-2023 నకు వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పై తెలిపిన కోర్టులో నీవు స్వయంగా గాని లేదా లాయర్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనవలెను లేనియడల నీపరోక్షమున తీర్మానించ బడునని తెలపటమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
ఎం.సుకన్య
ఆర్.ప్రశాంత్
అడ్వకేట్స్,ఒంగోలు.
సెల్ : 9247125145.

ప్రజాశక్తి
సోమవారం 30 అక్టోబర్ 2023

ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

కరువు నివారణ సహాయక చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు నియోజకవర్గంలో కరువు నెలకొన్నదని ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు రుణమాఫీ,పంట నష్టపరిహారం చెల్లించాలని లాంటి చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ రంగ సాయి, వి రామకష్ణ, ఏ బెనర్జీ, డి మూర్తయ్య, కె రంగనాయకులు, ఎం శ్రీనివాసులు, ఎం నెమిలయ్య, చలపతి, రామయ్య, పుల్లయ్య, రంగయ్య, సుబ్బయ్య, మురళి పాల్గొన్నారు.

తిరుమలగిరి కాలనీలో నీటి ఇబ్బందులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పంచాయతీ పరిధిలోని తిరుమలగిరి కాలనీలో నివసిస్తున్న గిరిజనులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ కాలనీలో ఉన్న బోర్లు మెరాయించడంతో సాగర్ నీటిపైనే ఆధారపడ్డారు. అయితే సాగర్ నీటిని ఐదు రోజులకు ఒకసారి కూడా సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటికొక డ్రమ్ము చొప్పున కొనుగోలు చేసుకొని నీటిని పట్టుకుంటున్నా సరిపోవడం లేదంటున్నారు. దీనికి తోడు నిత్యం పనులు చేసుకునే తమకు సాయంత్రానికి ఇంటికి వచ్చే సరికి నీళ్ల లేక మినరల్ వాటర్ కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. నీటి సమస్య పరిష్కరించాలని అక్కడి గిరిజనులు కోరుతున్నారు.

ర్యాలీ చేస్తున్న దృశ్యం

వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కొమరోలు

మండలం తాటిచెర్ల మోటులో స్థానిక సర్పంచ్ భర్త ,వైసిపి నాయకులు అయిన బొమ్మని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాటిచెర్ల గ్రామ వాల్మీకి యూత్ తాటిచెర్ల, మోటు, అక్కపల్లె గ్రామాలలో బైక్ ర్యాలీ నిర్వహించారు అనంతరం యూత్ ఏర్పాటు చేసిన భారీ కేకును బొమ్మని వెంకటేశ్వర్లు కట్ చేసి అందరికి పంచి పెట్టి వాల్మీకి జయంతి వేడుకలా నిర్వహించాకున్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి యూత్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బండి శ్రీను

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం నరవ గ్రామ పంచాయతీ సర్పంచ్ బండి శ్రీనివాసులు ఏపి రాష్ట్ర తొగట వీర క్షత్రియ యువజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైయ్యారు. విజయవాడలో జరిగిన కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మొడెం వీరాంజనేయ ప్రసాద్ బండి శ్రీనివాసులుకు నియామక పత్రం అందజేశారు.

కాపురాన్ని చక్కదిద్దబోయి

ఆగిన వృద్ధుడి గుండె..

ప్రజాశక్తి -బాపట్ల

ఓ కాపురాన్ని చక్కదిద్దే క్రమంలో జరుగుతున్న రాజీ ప్రయత్నంలో రెండు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న వివాదంలో యువతి కుటుంబ సభ్యుల్లోని ఓ పెద్దాయన ఊపిరి ఆగింది. ఈ ఘటన బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నగరం మండలం మట్లపూడి గ్రామానికి చెందిన యువతికి, నిజాంపట్నం మండలానికి చెందినఓ ఉపాధ్యాయుడితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబంలో తలెత్తిన మనస్పర్థల కారణంగా రెండేళ్ళగా భార్య భర్తలు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. వారి మధ్య రాజీకుదిర్చి కాపురాన్ని చక్కదిద్దేందుకు ఇరుకుటుంబాల పెద్దలు నిర్ణయించారు. అందులో భాగంగా వారంతా కలిసి న్యాయవాది కోసం బాపట్లకు వచ్చారు. న్యాయవాది వద్దకు వెళ తున్న క్రమంలో ఇరువైపుల కుటుంబ సభ్యుల మధ్య వివాదం తలెత్తింది. గతంలో జరిగిన పాత విషయాలు పునరావత్తం చేసుకుంటూ ఘర్షణ పడ్డారు. స్వల్ప వివాదం చిలికి చిలికి గాలివానగా తయారైంది. రాజీ ప్రయత్నం కాస్త బెడిసి కొట్టింది. చివరకూ రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవ తార స్థాయికి చేరి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి వెళ్లింది. పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదురుగా చోటు చేసుకున్న ఘటనను గమనించిన పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకొని అందరినీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురైన యువతి పెదనాన్న కరీముల్లా(66)నడుచుకుంటూ వెళ్తూ పోలీస్‌స్టేషన్ వద్ద ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో పోలీసు సిబ్బంది అప్రమత్తమయ్యారు. అదే సమయంలో అక్కడకు చేరిన అంటరానితన నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు చార్వాక తన కారులో కరీముల్లాను బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కరీముల్లా మతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు బాపట్ల రూరల్ సిఐ శ్రీనివాసులు తెలిపారు.

పిశాచాలను తరిమేస్తామంటూ మోసం

- మహిళను మభ్యపెట్టి నగదు అపహరణ యత్నం
- నిందితులను పట్టుకొని పోలీసులకు అప్పగింత

ప్రజాశక్తి-పొదిలి

మీ ఇంట్లో ఉండే భూత ప్రేత పిశాచాలను పారదోలుతామంటూ మహిళను మభ్యపెట్టి నగదును తీసుకుని ఉడాయించే వ్యక్తులను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. పట్టణంలోని పడమటి పాలెంలోని ఓ ఇంట్లో భూత పిశాచాలు ఉన్నాయంటూ ప్రార్థనలు చేస్తామని చెప్పి ఇంటిలోకి ప్రవేశించి ఆ మహిళలను మభ్యపెట్టి నగదు వసూలు చేసుకుని ఉడాయించేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకులను స్థానికులు పట్టుకున్నారు. ఇంటిలోకి ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులు సాంబ్రాణి పొగవేసి నెమలి ఈకలతో మత్తు మందు చల్లారు. నగదు తీసుకురావాలని, వాటితో ప్రత్యేక పూజ చేస్తామని చెప్పడంతో నమ్మిన ఆమహిళ లోపలికి వెళ్లి రూ.11 వేలు నగదు తీసుకు వచ్చింది. అలా వచ్చిన ఆమె మత్తుమందుతో స్పృహ తప్పగా నగదు తీసుకుని యువకులు ఉడాయించారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నిలదీయగా తేరుకుని అంత నగదు ఎందుకు ఇచ్చాననో తనకు తెలియదని చెప్పడంతో

మోసాలకు పాల్పడుతున్న నిందితులు

స్థానికులతో కలిసి నిందితులను పట్టుకున్నారు. వారికి దేహశుద్ధి చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు. వీరితో పాటు మరో ముగ్గురు ఉన్నట్లు పట్టణంలో పుకార్లు వ్యాపించడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. పట్టుకున్న నిందితులను ఎస్ఐ వెంకట సైదులు విచారిస్తున్నారు. వీరిని కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు.

బస్టాండ్ ప్రాంగణాన్ని బాగు చేయించాలి : సిపిఎం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం మొత్తాన్ని బాగు చేయించాలని సిపిఎం మండల కార్యదర్శి టంగుటూరి సత్యనారాయణ ఆదివారం డిమాండ్ చేశారు. ప్రాంగణం మొత్తం బాగు చేయించాల్సిది పోయి కేవలం రహదారి మాదిరిగా ఒక సిమెంట్ రోడ్డును నిర్మించి చేతులు దులుపుకోవడంలో గల ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ప్రాంగణమంతా గుంతలు ఏర్పడి, వర్షపు నీరు నిలబడి దోమలకు నిలయంగా మారి దుర్గంధం వెదజల్లుతుంటే అధికారులకు, పాలకులకు కనిపించలేదా అని పేర్కొన్నారు. బస్టాండ్ ఏర్పాటు చేసే రోజున మంత్రి సురేష్ రూ.1కోటి నిధులు మంజూరు చేసి బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తానని ప్రజల సాక్షిగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బస్టాండ్‌ను ఏర్పాటు చేసి రెండేళ్లు కావస్తున్నా రూపాయి నిధులు మంజూరు చేయలేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ప్రాంగణాన్ని బాగు చేయించడంతో పాటు ప్రాయాణికులకు సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



మండల కార్యదర్శి సత్యనారాయణ

ఎస్‌సివికె నూతన కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ నడిబొడ్డున 125 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీకొప్పరపు వెంకటకృష్ణ నిలయం (రీడింగ్ రూమ్) నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా డాక్టర్ ఇమ్మడిశెట్టి బాలసుబ్బారావు, కార్యదర్శిగా గుంటక సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా శాసనాల వీరబ్రహ్మం, సహాయ కార్యదర్శిగా ఎం.రామ్మోహన్, కోశాధికారిగా పి.మల్లికార్జునరావులు ఎన్నికయ్యారు. ఈ ప్రక్రియ నిర్వహణకు ఎన్నికల అధికారులుగా ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ బి.డేవిడ్ స్టోన్, చీదా శ్రీనివాస మల్లికార్జునరావులు వ్యవహరించారు. అనంతరం 125 ఏళ్ల చరిత్రకు గుర్తుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ సభ్యులను సత్కరించారు. నూతన కమిటీని ఎస్‌సివికె నిలయం సభ్యులు, ఎంఎస్ఎంఇ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మేడా బద్రీనాథ్, ఆర్‌కెజె నరసింహా, బొగ్గరపు శేషగిరిరావు, అంతర్జాతీయ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి చాటకొండ నాగరాజు తదితరులు అభినందించారు.

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ప్రమాదంలో గాయాలతో పడి ఉన్న యువకుడు

యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన అద్దంకి మేదరమెట్ల రోడ్లోని మధురానగర్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని సింగరకొండ పాలెం గ్రామానికి చెందిన పాలపర్తి రాజేష్ వ్యక్తిగత పనులు నిమిత్తం ఒంగోలు నుంచి స్వగ్రామం సింగరకొండపాలెం వస్తున్న సమయంలో మధురానగర్ వద్ద మార్జిన్లో నిలుపుదల అయి ఉన్న లారీని ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 కు సమాచారం అందించడంతో ప్రభుత్వ వైద్యశాలకు క్షతగాత్రుడ్ని తరలించగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రక్తదానం చేస్తున్న ఎస్ఐ అనిల్ కుమార్

రక్త దానం అభినందనీయం

ప్రజాశక్తి-సిఎస్‌పురం

యువకులు స్వతహాగా ముందుకు వచ్చి రక్త దానం చేయడం అభినందనీయమని యస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పామూరు లోని అనిల్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్‌పురం మండలంలో అనేక మంది యువకులు రక్తదాన శిబిరంలో పాల్గొనే విధంగా ప్రోత్సహించారు. వారితో పాటు యస్ఐ పాల్గొని రక్తం ఇచ్చారు. అలాగే రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు షేక్ గౌస్ కూడా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని పామూరు సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

భూమి పూజ చేస్తున్న పూర్వ విద్యార్థులు

సరస్వతి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండలం మొగల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980-81 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ద్వితీయ ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అప్పటి పూర్వ విద్యార్థులు అందరూ కలిసి సరస్వతి విగ్రహం ఏర్పటూ చేయాలని నిర్ణయించుకున్నారు. వారికి చదువు చెప్పిన హిందీ పండిట్ ఆర్‌వి నారాయణచే భూమి పూజ చేయించారు. ద్వితీయ ఆత్మీయ సమావేశం ఏర్పాటులో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని పాఠశాల గ్రామం యొక్క వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగరీత్యా, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు ప్రతి సంవత్సరం ఆత్మీయ సమాసం ఏర్పాటు చేసుకుని పాఠశాల అభివద్ధికి తోడ్పడాలని అనుకున్నారు. అనంతరం వారి గురువైన ఆర్వినారాయణకు ఘనంగా సన్మానించారు.

'కోన'కు విజయసాయిరెడ్డి భరోసా

బస్సు యాత్రలో విజయసాయిరెడ్డితో ఎంఎల్యే కోన రఘుపతి

ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్లే

ప్రజాశక్తి - బాపట్ల

సామాజిక సాధికారత యాత్రలతో వైసీపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి సామాజిక సాధికార యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చందోలులో మీడియాతో మాట్లాడారు. అద్భుతంగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతిని బాపట్ల నుండి తిరిగి గెలిపించాలని ప్రకటించారు. దీంతో ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. సామాజిక సాధికారత కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే కోన రఘుపతికి ఒక బలమైన భరోసా లభించింది. మళ్లీ బాపట్ల నుండి కోన రఘుపతిని గెలిపించాలని విజయ సాయిరెడ్డి ఇచ్చిన పిలుపుతో ఇప్పుడు కోన శిబిరంలో హర్షం వ్యక్త మవుతోంది. దీన్నిబట్టి కోన రఘుపతికి టికెట్ ఖాయంగా భావించ వచ్చని ఆ శిబిరం ఆశాభావాన్ని వ్యక్తం చేస్తోంది. టికెట్ ఖరారు అయ్యేవరకు పరిస్థితి ఎలా ఉన్నా విజయసాయిరెడ్డి ప్రకటన తాజాగా కోన శిబిరంలో సంతోషాన్ని నింపింది. భారీ మెజార్టీతో వైసిపి గెలవాలని పదే పదే పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కోన సూచన చేస్తున్నారు. సాధికారత సభలో ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ రఘుపతిని కొనేవాడు ఎవడు? ఓడించేవాడు ఎవడని ఉద్వేగ ప్రసంగం చేశారు. బాపట్ల వైసీపీ టికెట్ విషయంలో రకరకాల ఊహాగానాలు, తర్జనభర్జనలు, జరుగుతున్నాయి. బలమైన సామాజిక వర్గం నుండి అనేక మంది ప్రయత్నాల పరంపర కొనసాగిస్తూనే ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేకే తిరిగి టిక్కెట్ ఖాయమని బలమైన సంకేతాలు ఉన్నప్పటికీ అనేక మంది వెనకడుగు వేయకుండా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు విజయసాయిరెడ్డి ప్రకటన ఆ వర్గాల్లో ఆందోళన కలిగిస్తుంది. బాపట్ల వైసీపీలో వర్గాల మధ్య జరుగుతున్న పోరాటంలో ఫ్యాను గాలి ఏ వర్గం వైపు ఇస్తుందో వేచి చూడాని కోన వ్యతిరేక వర్గీయులు అంటున్నారు. అయితే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను విజయసాయిరెడ్డి ప్రకటిస్తే సరిపోతుందా? సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటించాల్సిన అవసరం ఉంది కదా అని ఆయా వర్గాల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా కోన శిబిరంలో మాత్రం ఆనందోత్సతహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ వైద్యశాలకు మోటార్ బహుకరిస్తున్న దేవరాజు

వైదశాలకు మోటార్ బహూకరణ

ప్రజాశక్తి - చీరాల

గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు అన్నారు. రోటరి క్లబ్ ఆఫ్ క్షీరపురి, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ పేదలకు సేవ చేయడానికి ఎప్పుడు ముందు ఉంటుందని అన్నారు. పేదలకు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ వైద్యశాలకు నీళ్ల మోటర్ సెట్‌ను వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ జన్మదిన సందర్భంగా బహుకరించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రూ.20వేల విలువైన మోటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో హాస్పటల్ సూపర్డెంట్ డాక్టర్ సుహాసిని, హెచ్ఎం రావి వెంకట రమణరావు, హాస్పటల్ సిబ్బంది సుందరమ్మ, విజయనిర్మల, పూర్ణ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈనెల 30న జిల్లా స్థాయిలో వివిధ విభాగాల్లో జరగనున్న అథ్లెటిక్స్ పోటీలకు ఎస్‌జిఎఫ్ఐ అండర్ 14, 17 విభాగాలలో సురేపల్లి విపి అండ్ జిఎస్ఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసశర్మ తెలిపారు. ఈ సందర్భంగా చుండూరు మండలం ఎడ్లపల్లిలో ఆదివారం జరిగిన వేమూరు నియోజకవర్గస్థాయి పోటీలలో జిల్లా జట్టులో ఆడేందుకు భట్టిప్రోలు మండలం నుండి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, క్రీడా ఉపాధ్యాయులను హెచ్ఎంతో పాటు పాలకవర్గ అధ్యక్షులు వేపూరి చలమయ్య, కృష్ణారావు అభినందించారు.

రన్నింగ్ పోటీల్లో ప్రారంభిస్తున్న పైనం ఏడుకొండలరెడ్డి

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో రన్ పోటీలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రన్ పోటీల ద్వారా విద్యార్థులలో శారీరక, మానసిక దృఢత్వం పెరిగి విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడుతుందని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి అన్నారు. మండలంలోని పొన్నపల్లి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా రన్ 4.0లో జిల్లాస్థాయి ఓపెన్ 5కె, 3కె, 2కె రన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. పోటీలను స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి ప్రారంభించారు. 500మందికిపైగా విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. 2కె రన్ విభాగంలో డి వాసంతి, వై రాఘవ సాయికుమార్, టి కార్తికేయ, 3కె రన్ బాలికల విభాగంలో పి నాగ స్వాతి, పి హేమ చందన, పి జెస్సికా లుదియా, 3కె రన్ బాలుర విభాగంలో డి శివగణేష్‌రెడ్డి, కె వెంకటేశ్వర్లు, బి లక్ష్మీనరసింహారెడ్డి, 5కె రన్ బాలుర విభాగంలో కె వెంకట శివారెడ్డి, ధనుష్‌రెడ్డి, రామ్మూర్తిరెడ్డి, 5కె రన్ బాలికల విభాగంలో బి నాగ తేజస్విని, ఒ జోష్ణశ్రీ, రమ్య గౌతమి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో స్కూల్ సీఈఓ పైన గణేష్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసాదరెడ్డి, ప్రిన్సిపాల్ నర్గీస్ క్యాజి పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారులకు అభినందనలు

ఖోఖో రాష్ట్ర జట్టును అభినందిస్తున్న సినీ దర్శకుడు అనిల్

ప్రజాశక్తి - పంగులూరు

గోవాలో జరుగుతున్న జాతీయ క్రీడల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ పురుషుల ఖోఖో జట్టును సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ శ్రీలీల అభినందించారు. జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు గత ఐదు నెలల నుండి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆర్థిక సహాయ సహకారాలతో స్థానిక మాగుంట సుబ్బరామి రెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ జరుగుతున్నది. ఖోఖో శిక్షణాశిబిరం తుది దశకు చేరుకుంది. ఈ సందర్భంగా సినీ దర్శకులు అనిల్ రావిపూడి, హీరోయిన్ శ్రీ లీల బంధువుల ఇంటికి వచ్చిన సందర్భంగా ఆదివారం ఇక్కడ జరుగుతున్న శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. రాష్ట్ర జట్టు క్రీడాకారులను ప్రతి ఒక్కరినీ స్వయంగా కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమకు క్రీడలు అంటే ఎంతో ఇష్టమని అన్నారు. క్రీడల ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయని అన్నారు. నేషనల్ గేమ్స్‌లో పతకం సాధించి రాష్ట్రానికి పేరు తేవాలని కోరారు. రాష్ట్రంలో ఖోఖో అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జట్టు సభ్యులకు కరచాలనం చేసి మంచి ఫలితాలతో తిరిగి రావాలని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బాచిన చెంచు ప్రసాద్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఎం సీతారామిరెడ్డి, ఇండియన్ రైల్వే ఖోఖో శిక్షకులు బ్రహ్మనాయుడు, శాప్ ఖోఖో శిక్షకులు డిఎన్ రెడ్డి, రాష్ట్ర జట్టు సహాయ శిక్షకుడు, అంతర్జాతీయ క్రీడాకారుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఖో ఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య, అద్దంకి నియోజవర్గం వైసిపి ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య, ఎపి ఖోఖో అసోసియేషన్ చీఫ్ పాటర్న్ ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎపి ఖో ఖో ప్రెసిడెంట్ టిఎస్ఆర్‌కె ప్రసాద్, ప్రకాశం జిల్లా ఖో ఖో జిల్లా కార్యదర్శి బి కాశీవిశ్వనాథరెడ్డి, ప్రెసిడెంట్ కె భాస్కరరావు ఎపి ఖోఖో టీం పతకం సాధించాలని కోరారు.

'సృజన'కు కృతజ్ఞతలు

రఘునాధశర్మను సన్మానిస్తున్న సృజన సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - అద్దంకి

అభినవ సూరన గాడేపల్లి స్మారక పురస్కార సభలో ఆచార్య శలాక నన్ను సృజించిన 'సృజన' నాలో మరింత సాహిత్యోపాసనకు ఉత్సాహాన్ని, శక్తిని ఇస్తుందని బ్రహ్మశ్రీ ఆచార్య శలాక రఘునాధ శర్మ పేర్కొన్నారు. సీతారామ మూర్తి స్మారక సృజన జీవిత సాఫల్య సాహిత్య పురస్కారం –2023' ను శర్మకు అద్దంకి సృజన సాహిత్య పురస్కార అందజేసింది. రాజమహేంద్రవరం ఏకేసీ కళాశాల సమీపంలోని శ్రీ కామేశ్వరి నిలయంలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవ సభకు సన్నిధానం శాస్త్రి అధ్యక్షత వహించారు. సభకు విశ్వనాధ గోపాలకృష్ణ విచ్చేశారు. పురస్కార గ్రహీత శలాక రఘునాధ శర్మ మాట్లాడుతూ సీతారామమూర్తితో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆచార్య శలాక రఘునాధ శర్మను సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకర్ దత్, డాక్టర్ గాడేపల్లి చంద్రదత్ ఘనంగా సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. సభకు అధ్యక్షత వహించిన బ్రౌన్, సన్నిధానం శాస్త్రి అతిథులను సభకు పరిచయం చేశారు. సత్యసుధ, అరవింద, సుబ్బలక్ష్మి, గాడేపల్లి జ్యోత్స్న, చంద్రదత్, గరికిపాటి సుబ్రహ్మణ్యం, అద్దంకి లేవి ప్రసాద్, సంకా సుబ్రహ్మణ్యం (బాబు), అనంతు నాగేశ్వరరావు, పీసీహెచ్ కోటయ్య పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు ఫిర్యాదులపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - పర్చూరు

ఓట్ల తొలగింపుకు తప్పుడు సమాచారంతో దరఖాస్తు చేశారని వీఆర్వో ఫిర్యాదు చేయడంతో నమోదైన కేసులను చీరాల డిఎస్పి వెంకటేశ్వర్లు విచారించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మార్టూరు ఇన్చార్జి సీఐ ప్రభాకర్, స్థానిక ఇన్చార్జి ఎస్ఐ నాగశ్రీతో కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పర్చూరు, యద్దనపూడి, మార్టూరు స్టేషన్లలో 8కేసులు నమోదైనట్లు తెలిపారు. ఫిర్యాదులో ఉన్న నిందితులను పిలిపించి వివరాలు తీసుకున్నారు. దరఖాస్తులు చేసేందుకు వారి వద్ద ఉన్న సమాచారంపై ప్రశ్నించారు. సంబంధిత వీఆర్వోలను పిలిపించి వివరాలు తీసుకున్నట్లు తెలిసింది. దీనిపై వివరణ కోరగా ఓటర్ల జాబితాలపై నమోదైన కేసుల పురోగతిపై సమీక్షిస్తున్నట్లు డిఎస్పి తెలిపారు.

గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమంలో మేరుగ నాగార్జున

'గడప గడపకూ'లో మేరుగ

ప్రజాశక్తి - భట్టిప్రోలు (చుండూరు)

మండలంలో ఆదివారం గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. సంక్షేమ పాలన జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేశారని అన్నారు. వారికి అన్ని విధాల సంక్షేమ పథకాలు చేరవేస్తున్నట్లు చెప్పారు. పేదల పక్షాన పనిచేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని మరోమారు గెలిపించుకోవాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితునికి ఆర్ధిక సహాయం ఇస్తున్న సర్పంచి

మోపిదేవి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని పోటుమెరక గ్రామాల్లో ఈ నెల 27న జరిగిన అగ్ని ప్రమాదంలో రేపల్లె గోపాల కృష్ణ ఇల్లు కాలిపోయింది. ఆ ఘటనలో ఆస్తి నష్టం జరిగింది. ఆ సంఘటనను సర్పంచ్ కాగితాల హనుమ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎంపి రూ.20వేల ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు. అలానే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి వారికి అన్ని విధాలా ఆదుకుంటామని సర్పంచ్ ద్వారా భరోస ఇచ్చారు.

అన్నా క్యాంటిన్‌లో అన్నదానం చేస్తున్న టిడిపి నేతలు

ఏడాదికి చేరువలో అన్న క్యాంటీన్

బాపట్ల : ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా పేద ప్రజల ఆకలి తీర్చాలన్న సంకల్పంతో బాపట్ల టిడిపి కార్యాలయం వద్ద టిడిపి ఇన్ ఛార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ 360వ రోజుకుచేరింది. నరేంద్ర వర్మ సహకారంతో ఆదివారం దాదాపు 250మంది పేదలకు అన్న దానం చేశారు. కార్యక్రమంలో బూర్లె రామ సుబ్బారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిద్దా ఆరాధ్యను అభినందిస్తున్న నిర్వాహకులు

స్కేటింగ్ విజేతలు శిద్దా ఆరాధ్య,విప్ర్

చీమకుర్తి : ఇండియా అమెచ్యూర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సూనియర్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సెకండ్ విజేతగా టిటిడి బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ కుమార్తె శిద్దా ఆరాధ్య నిలిచింది. మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు సమీపంలోని హర్షిణీ జూనియర్ కాలేజీలో పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో శిద్దా విప్ష్ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా శిద్దా ఆరాధ్య,శిద్దా విప్ష్‌కు మెమొంటోలు అందజేసి అభినందనలు తెలిపారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి-కొండపి

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. కొండపిలోని అంబేద్కర్ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమంద నాయుడు, వై.పెద్దోడు, వై.వెంకటేశ్వర్లు, ఎన్.సుబ్బరామయ్య, బి.సోమయ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి రాబోవు ఎన్నికల సందర్భంగా ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ జి.రామయ్య చౌదరి, టిడిపి నాయకులు వసంతరావు, రావిపాటి సీతమ్మ, మండల మహిళా అద్యక్షులు బి.ప్రసన్నలక్ష్మి, టిడిపి యూత్ మండల అధ్యక్షుడు కాలేషా, రవికుమార్,మస్తాన్ పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే స్వామి

మిట్టపాలెంలో..

మిట్టపాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఇంటింటికీ తిరిగి టిడిపి మ్యానిఫెస్టు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వీరాస్వామి, వసంత, మాలకొండయ్య, తిరుపతి స్వామి, ఎం.నాగభూషణం, మండవ అచ్చెయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

యూనియన్ బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ ఒంగోలు రీజియన్ కమిటీ సమావేశం స్థానిక ఎల్‌పిజి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో 12వ వేతన సవరణ, బ్యాంకింగ్ రంగంలో అభివృద్ధి గురించి చర్చించారు. అనంతరం ఒంగోలు రీజియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రీజినల్ సెక్రటరీగా ఎన్‌వి. పవన్, అసిస్టెంట్ రీజినల్ సెక్రటరీగా బి.బాలకోటయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎస్‌వి.రమణ, బెఫి రాష్ట్ర జనరల్ సెక్రటరీ అజయ్‌కుమార్, బెఫి రాష్ట్ర ప్రెసిడెంట్ సాంబశివరావు, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి-కొండపి

గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు తెలిపారు. కొండపి శాఖ గ్రంథాలయంలో చదవడం మా కిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ విద్యార్థులు సెలవుల సమయంలో బయట తిరగకుండా గ్రంథాలయానికి వచ్చి నీతి పుస్తకాలు, వీరుల గాథ పుస్తకాలు, జ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు చదవాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత కథలు చెప్పించడం, పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

200 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

హైదరాబాద్‌కు చెందిన స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపోవు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెల్త్ సూపర్ వైజర్ కెఎల్.నాగేశ్వరరావు, దుర్గా ప్రసాద్, స్వాతి, రాఘవేంద్రరావు, శైలుషా, గోనుగుంట వీర బ్రహ్మాచారి, స్టార్ పౌండేషన్ అధ్యక్షుడు సూరి లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు భాను మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి మండల పరిధిలోని పాటిమీదపాలెం అంబేద్కర్ నగర్‌కు చెందిన సామాజిక ప్రజాగాయకుడు సంగా భానుమిత్ర(56) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. సంగాభానుమిత్ర గతంలో జననాట్యమండలి సభ్యుడిగా ,కళాకారునిగా అనేక ఉద్యమాలలో పనిచేశారు. చీమకుర్తి ప్రాంతంలో నిర్వహించిన అనేక సామాజిక ఉద్యమాలలో చురుకుగా పనిచేశారు. మహాజన పార్టీలో క్రియాశీలక పనిచేశారు. బౌద్ధమతం స్వీకరించారు.కళారూపాలు, పాటల ద్వారా ప్రజలను చైతన్య పరిచారు. భానుమిత్రకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భానుమిత్ర భౌతికకాయాన్ని జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకటరావు, చీమకుర్తి మండల అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు,పి. కొండలు,జి. పోతురాజు, దాసరి అంకయ్య, వేమాబ్రహ్మాయ్య, అంకారావు, పి.శ్రీనివాసరావు, ఎంఆర్‌పిఎస్ నాయకులు జె. ఆంజనేయులు, టి.ఆనంద్, మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు పేరం శ్రీను, పేరం సత్యం, విరసం మాజీ నాయకులు పిన్నిక శ్రీను, గంగయ్య తదితరులు సందర్శించిన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-ముండ్లమూరు

విద్యా బుద్ధులు నేర్చుకున్న పాఠశాల అభివృద్ధి కృషి చేద్దామని సీనియర్ జర్నలిస్ట్ ఎస్‌వి.బ్రహ్మం కోరారు. ముండ్లమూరు హైస్కూల్ లో 1990-91లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం విజయవాడలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వహణలో వ్యాపార రీత్యా విజయవాడలో స్థిర పడిన కోటా గురునాథం కీలక పాత్ర పోషించారు. 32 సంవత్సరాలు క్రితం పాఠశాలలో చదివిన విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలవడంతో ఆనందంగా మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరి ని ఒకరు పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివద్ధి కు కృషి చేద్దాం అని పూర్వ విద్యార్థులు తీర్మానిచ్చారు. పాఠశాల ముఖ మండపం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి అందరూ కలసిన, విద్యా బుద్ధులు నేర్చుకున్న పాఠశాల అభివద్ధికి అందరూ సహకరించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పున్నారావు, బేతపూడి లింగరావు, బోడేపూడి ప్రసాద్, మలేంపాటి ఆంజనేయులు, కిలారి ప్రసాద్, కొర్రపాటి దినేష్, రావేళ్ల హరిబాబు, రెడ్డి మాస్ రాఘవులు, బోడపాటి గాంధీ, గురునాదం, మేదరమెట్ల కల్పన, కొర్రపాటి వాణి, సుబ్బారావమ్మ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సామాజిక ఉద్యమనేత అయ్యూబ్‌కు నివాళి

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం అనేక ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచిన ముస్లిం సామాజిక ఉద్యమకారుడు మహమ్మద్ అయూబ్ ఐదవ వర్ధంతి స్థానిక చంద్రయ్య నగర్ లోని వారి నివాసంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డు నాగమణి అనే పేద మహిళలకు రూ. 5000 ఆర్థిక సాయం, బియ్యం, నెలకు సరిపడా సరుకులను అయూబ్ కుమారులు మహమ్మద్ ఆషిక్, మహమ్మద్ హర్షద్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం బలరాం కాలనీ, కరుణా కాలనీల్లోని వద్ధాశ్రమాల్లోని వద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సామాజిక వేత్త ,హైకోర్టు న్యాయవాది షేక్ కరిముల్లా మాట్లాడుతూ అయూబ్ సుదీర్ఘ కాలం సామాజిక ఉద్యమాలకు నాయకత్వం వహించి ,బలహీన వర్గాల పక్షాన, మైనారిటీల పక్షాన, అలుపెరుగని పోరాటం చేసారని తెలిపారు.ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ అయూబ్ లేని లోటు తీర్చలేనిదని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బక్కముంతల వినయ్, అర్పముస్లిం సామాజిక కార్యకర్త పఠాన్ కరిముల్లా ఖాన్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి నాయకులు మహమ్మద్ అషిక్,అర్షద్, కరిముల్లా ,గోరే హుస్సేన్, రియాజ్, బాషా, నవాజ్, రఫీ, రబ్బాని, కళ్యాణ్, చరణ్, చిరంజీవి, హనుమారెడ్డి, అయూబ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

గుంటూరు 'ఆస్టర్ రమేష్'కు జాతీయ అవార్డు

హాస్పిటల్ సీనియర్ జనరల్ మేనేజర్ రాజశేఖర్ జ్యేష్ట వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు

గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు వాయిస్ ఆఫ్ హెల్త్ కేర్ అనే జాతీయ స్థాయి వచ్చినట్లు హాస్పిటల్ సీనియర్ జనరల్ మేనేజర్ రాజశేఖర్ జ్యేష్ట తెలిపారు. వరల్డ్ స్ట్రోక్ డే -2023 ను పురస్కరించుకుని గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఈ నెల 27న నేషనల్ స్ట్రోక్ కాన్ క్లేవ్ -2023 నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బెస్ట్ స్ట్రోక్ అవేర్నెస్ అడ్వకేట్ హాస్పిటల్ ఆఫ్ ది ఇయర్ జాతీయ అవార్డు తమ హాస్పిటల్‌కు అందజేసినట్లు ఆయన తెలిపారు. గుజరాత్ రాష్ట్ర ఆరోగ్య మరియు సంక్షేమ శాఖ మంత్రిబుషికేష్ గణేష్ భాయ్ పటేల్ చేతుల మీదుగా ఆస్టర్ ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి నాణ్యతా ప్రమాణాల సంస్థ 'జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్' (జెసిఐ) అత్యున్నతమైన వైద్య సేవలు అందించే హాస్పిటల్స్ కు ఇచ్చే గుర్తింపులో భాగంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు ఇటీవల రెండో సారి గుర్తింపు వచ్చినట్లు తెలిపారు. భారతదేశంలో ఎంతో ప్రతిష్టాకరమైన క్వాలిటీ అండ్ అక్రిడిటేషన్ ఇనిస్టిట్యూట్ దేశం మొత్తం మీద స్ట్రోక్ పేషెంట్లకు నాణ్యమైన వైద్య సేవలు అందించే ఆరు స్ట్రోక్ సెంటర్లకు గుర్తింపు ఇచ్చినట్లు తెలిపారు. మన రాష్ట్రంలో ప్రత్యేకమైన పూర్తి స్థాయి స్ట్రోక్ సెంటర్‌ను నిర్వహిస్తున్న గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ కు అక్రిడిటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. అవార్డు అందుకున్న సందర్భంగా డాక్టర్ కుమారవేలు మాట్లాడుతూ స్ట్రోక్ వచ్చిన మొదటి గంటలో వ్యాధి నిర్ధారణ,వైద్య చికిత్స ఎంతో అవసరమని,. తద్వారా ప్రాణహాని నుంచి దీర్ఘకాలిక అంగవైకల్యం నుంచి రోగిని కాపాడువచ్చునని తెలిపారు. స్ట్రోక్ కారకాలుగా పరిగణించే రక్తపోటు,షుగర్ వ్యాధులను అదుపులో ఉంచుకోవాల్సిన అవసరాన్ని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సామాజిక బాధ్యతగా గుర్తించి పక్షవాతం వల్ల సంభవించే దుష్ఫలితాల పట్ల సమాజంలోని పౌరులకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పక్షవాత నివారణ కోసం నడక అనే కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలలో అవగాహన కలిగించడానికి గుంటూరు మరియు పరిసర ప్రాంతాలలో ఎంతో కృషి చేసినందుకు జాతీయస్థాయిలో బెస్ట్ స్ట్రోక్ అవేర్నెస్ అడ్వకేట్ హాస్పిటల్ ఆఫ్ ది ఇయర్ అవార్డును తమ హాస్పిటల్‌కు అందజేసినట్లు తెలిపారు. ప్రతేఏడాది అక్టోబర్ 29న ప్రపంచ వ్యాప్తంగా 'వరల్డ్ స్ట్రోక్ డే' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 'టుగెదర్ వీఆర్ గ్రేటర్ దేన్ స్ట్రోక్' అనే నినాదంతో పక్షవాతం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ చీఫ్ న్యూరాలజిస్ట్ మేజర్ జనరల్ విశ్రాంత డాక్టర్ కుమార్ వేలు ఆధ్వర్యంలో ముగ్గురు న్యూరాలజిస్టులు అత్యంత నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. స్ట్రోక్ వచ్చిన వెంటనే వ్యాధి నిర్ధారణలో ఉపయోగపడే అధునాతన వైద్య పరికరాలైన ట్రాన్స్ క్రేనియల్ డాప్లర్,128 స్లైస్ సిటీ స్కానర్, 3 టెస్లా ఎంఆర్ఐ మరియు ప్రత్యేకమైన స్ట్రోక్ యూనిట్ అందులోకి తెచ్చినట్లు తెలిపారు. గుంటూరు, ఒంగోలు మరియు విజయవాడలో స్ట్రోక్‌తో హాస్పిటల్ నందు చేరిన రోగులను నిరంతరం పర్యవేక్షించడానికి 'క్లౌడ్ డాక్స్ రమేష్ అనే టెలి ఐసియు అధునాతన టెక్నాలజీతో విజయవాడలో సెంట్రల్ కమాండ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముగ్గురు క్రిటికల్ కేర్ వైద్య నిపుణులచే ఏర్పాటు చేసి నిరంతరం రోగులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎంతోమంది రోగులను శాశ్వతంగా వైకల్యం నుంచి మరియు ప్రాణహాని నుంచి కాపాడిన న్యూరాలజీ వైద్య బందాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ న్యూరాలజిస్టులు డాక్టర్ ఎస్. బాలకష్ణ, డాక్టర్.పి.హరిణి, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్.పావులూరి శ్రీనివాసరావు మరియు బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ డాక్టర్ వై.కార్తీక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న డాక్టర్ కుమారవేలు

ఆ రహదారిపై ఆదమరిస్తే అంతే

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత నాలుగేళ్లుగా రహదారుల అధ్వాన స్థితికి చేరి ప్రమాద భరితంగా మారడం ఒక ఎత్తయితే వేసిన రోడ్లు 6నెలలు కాకముందే దెబ్బతిని ప్రయాణికులకు ప్రాణ సంకటకంగా మారాయి. భట్టిప్రోలు, పెదపులివర్రు రహదారి ఆరు నెలల క్రితం రూ.20లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం చేశారు. భట్టిప్రోలు నుండి బిఎం డ్రైన్ వరకు అప్పటికే దెబ్బతిన్న రహదారిని పూర్తిగా తొలగిం చారు. దానిపై మరో మారు బీటీ రోడ్డును నిర్మించారు. కానీ రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణా లు పాటిం చలేదు. నిర్మాణం చేసిన ఆరు నెలలకే పూర్తిగా దెబ్బతిని రాళ్ళు లేచిపోయి గుంటలు పడ్డాయి. దీంతో ప్రయాణానికి ప్రాణ సంకటకంగా మారింది. బిఎం డ్రైన్ నుండి పెసర్లంక వరకు అప్పటికే దెబ్బతిన్న రహదారిపై అక్కడక్కడ మాసికలు వేశారు. అది కూడా అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్యాచ్ వర్క్ పూర్తిగా దెబ్బతిని రహదారి ధ్వంసం అయ్యింది. భట్టిప్రోలు నుండి లంక గ్రామాలకు వెళ్లడానికి రెండవ అతి ప్రధానమైన రహదారి ఈ మార్గం. నిత్యం లంక గ్రామాల నుండి మండల కార్యాలయాలకు వివిధ రకాల పనులపై వచ్చే వాహన చోదకులకు ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయాం దోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అనునిత్యం పెద్దపులి వర్రు, గొరిగిపూడి, ఓలేరు, పెసర్లంక, చింతమోటు, పెదలంక గ్రామాల నుండి రైతులు కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలను ఈ రహదారి ద్వారానే భట్టిప్రోలు తరలిస్తుంటారు. పెసరలంక నుండి రహదారి పూర్తిగా గుంటలమయం కావడమే కాక పగిలిపోయి జిగ్ జాగ్‌గా మారింది. వాహనాలు ప్రయాణించే సమయంలో ఈ జిగ్ జాగ్ రహదారిపై ఎటువైపు వాలి పడిపోతుందోనని వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతుంటారు. లక్షలు వెచ్చించి నిర్మించిన రహదారి నెలల సమయంలోనే ధ్వంసం కావడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో నాణ్యత లోపంగా ఉన్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం పట్టీ పట్టనట్లుగా వ్యవహరిం చడంతోనే నిర్మించిన కొద్ది రోజులకే రోడ్లు దెబ్బతిన్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ప్రధానమైన ఈ రహదారిని పరిశీలించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, రహదారి మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వాన్నంగా పెదపులివర్రు రోడ్డు

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నక్కా కాంతారావు

ప్రజాశక్తి - అద్దంకి

కావలి వద్ద కొందరు దుండగులు ఈనెల 26న ఆర్టీసీ డ్రైవర్ బి రాంసింగ్‌పై దాడి చేయడాన్ని ఏపీ పీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నక్కా కాంతారావు ఖండించారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని చెప్పటమే కాకుండా చేసి చూపిస్తూ దేశంలోనే ఎపిఎస్ ఆర్టీసీకి మంచి పేరు వున్నదని అన్నారు. బెంగళూరు నుండి ప్రయాణికులను విజయవాడ తీసుకొని వెళుతున్న ఆర్టీసీ ఉద్యోగిని కావలిలో కార్ డ్రైవర్, కొంతమంది దుండగులు బస్సును వెంబడించి బస్ డ్రైవర్ బి రాంసింగ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో విలీనమైన తరువాత ప్రభుత్వ ఉద్యోగులుగా, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్‌గా ఉద్యోగులు మారినారని అన్నారు. అయితే ఉద్యోగులంటే గతంలో గౌరవభావం ఉండేదని, నేడు ఉద్యోగ సంఘ నాయకులు ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్న విధానం సమాజంలో ఉద్యోగ వ్యవస్థని, ఉద్యోగ హక్కులను హరించేస్తున్నాయని అనడానికి కావలిలో డ్రైవర్‌పై జరిగిన దాడి ఒక ఉదాహరణని అన్నారు. సంఘాల నాయకులు, హక్కుల పోరాటంలో ముందుండాలని అన్నారు. నేటికైనా కలసి హక్కుల కోసం, ఆత్మ గౌరవం కోసం ఉద్యమాలను నిర్మిం చాలని అన్నారు. సమాజంలో ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమే ననే విషయం ప్రభుత్వం, సంఘ నాయకులు ఆచరణలో చూపాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘట నలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని అన్నారు. ఆర్టీసీ యాజ మాన్యం, పోలీసులు వెంటనే నిందుతులపై హత్య యత్నం, ఐపీసీ సెక్షన్ 217/23యు /143, 341, 332, 307, 323, 427ఐపీసీ సెక్షన్ల క్రింద వెంటనే అరెస్ట్ చేసి ఉద్యోగుల పట్ల దౌర్జన్యంచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నక్కా కాంతారావు

బొబ్బేపల్లిలో ఉద్రిక్తత

● తమ పొలాల్లో గ్రావెల్‌లారీలు వెళ్తున్నాయని రైతుల ఆందోళన ● పోలీసులే దగ్గరుండి దారి వేయించడంపై తీవ్ర విమర్శలు

రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ లారీలకు తమ పొలాల్లోని కొండకాలువను పూడ్చి రహదారి ఏర్పాటు చేసి రాకపోకలు సాగించడం వల్ల పంట ధ్వంసమై నష్టపోతామని రైతులు ఆందోళనకు దిగిన సంఘటన మండలంలోని బొబ్బేపల్లిల్లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక రైతు మక్కెన శ్రీనివాసరావు, మరి కొందరి పొలాలు బొబ్బేపల్లి కొండకు సమీపంలో ఉన్నాయి. బొబ్బేపల్లి గ్రామంలోని కొండను లీజుకు తీసుకున్న కాంట్రాక్టర్ కొండ నుండి తవ్విన ఎర్రమట్టిని ఎక్కువ ట్రిప్పులు ఊళ్ళో గుండా లారీల్లో తరలించడానికి స్థానికులు అడ్డుకున్నారు. దీంతో దొడ్డిదోవన రైతుల పొలాల్లోని కొండ కాలువను పూడ్చి దారి ఏర్పాటు చేయడం వివాదానికి దారితీసింది. విషయం తెలుసుకున్న రైతులు అక్కడకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ప్రశ్నించిన తమపై దౌర్జన్యం చేస్తూ మీకు దిక్కున్న చోట చెప్పుకోండంటూ బెదిరించారని రైతులు వాపోయారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కాంట్రాక్టర్ దౌర్జన్యాన్ని ఆపవలసింది పోయి వాస్తవాలు తెలుసుకోకుండా దగ్గరుండి రోడ్డు వేయించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే సమస్యను తహశీల్దారు దగ్గర పరిష్కరించుకోండంటూ పోలీసులు ఉచిత సలహా ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ చేలల్లో గుండా గ్రావెల్ లారీలు వెళ్ళటం వల్ల రైతులందరూ తీవ్రంగా నష్టపోతామని తెలిపారు. లారీలు తిరిగితే పొలాలు సాగుకు పనికి రాకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు మక్కెన కోటేశ్వరరావు, కుప్పాల వెంకటేశ్వర్లు, బొప్పూడి రామాంజనేయులు, బత్తుల లాజర్, బొప్పూడి రాఘవయ్య, కున్నాపు వెంకటేశ్వర్లు, యద్దనపూడి ముసలయ్య కోరుతున్నారు.

మట్టి లారీల కోసం రైతుల పొలాల్లో వేసిన గ్రావెల్‌రోడ్డు

పాదయాత్రలో మాజీ మంత్రి నక్క ఆనందబాబు

టిడిపి పాదయాత్ర

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

వేమురు నియోజకవర్గం అమృతలూరు మండలం కూచిపూడి నుండి తెనాలి వైకుంటపురం వరకు మహిళా విభాగం ఆధ్వర్యంలో చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా పాదయాత్ర చేపట్టారు. సైకో పోవాలి. బాబు రావాలి అనే నినాదంతో పాటు నిజం గెలవాలి చంద్రబాబు ఆరోగ్యంతో జైలు నుండి బయటకు రావాలని కోరుతూ చేపట్టిన పాదయాత్రలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనాసుర అరాచకం కొనసాగుతుందని అన్నారు. దానిని అంతమొందిం చేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని అన్నారు. చంద్రబాబును అక్రమ అరెస్టుతో జైలు పాలు చేసి ఇప్పటికి 51రోజులు దాటినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ఆధారాలను చూపించలేకపోయిందని అన్నారు. కక్ష సాధింపుగానే ఇలాంటి అక్రమ అరెస్టులు చేశారని ఆరోపించారు. యావత్ ప్రపంచంలో తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిన మహోన్నత వ్యక్తి చంద్రబాబని, అలాంటి వ్యక్తిని ఎలాంటి అవినీతి లేకపోయినప్పటికీ కావాలని కక్షపూర్తిగా జైలు పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వైకుంటపురంలో నూట ఒక్క కొబ్బరికాయలు కొట్టి మహిళలు పూజలు చేశారు.

పంచాయితీ కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్న నేతలు

కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని బుర్లవారిపాలెం సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దసరా సందర్భంగా జెసిఎస్ మండల కన్వీనర్ బుర్ల సాంబశివరావు తన సొంత నిధులతో బట్టలు పంపిణీ చేశారు. కార్మికుల సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఆసాధి అంకాలరెడ్డి, ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వైసిపి నాయకులు గవిని నారాయణ, పిఎసిఎస్ ఛైర్మన్ బోయిన కేశవులు, నాదెండ్ల కోటేశ్వరరావు, మల్లవరపు యేసురత్నం, బుర్ల మురళి, పిట్టు పోలయ్య, గవిని యానదిరావు, బోయిన స్వాములు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

తహశీల్దారు నాగరాజు

ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్నట్లు తహశీల్దారు నాగరాజు తెలిపారు. నియోజకవర్గంలో 1,90,817 ఓట్లు నమోదైనట్లు చెప్పారు. వీరిలో పురుషులు 92,508, మహిళ లు 92,102ఓటు హక్కు కలిగి ఉన్నారని అన్నారు. మండ లాల వారీగా చూస్తే చుండూరులో 36,698, అమృత లూరులో 36,383, వేమూరులో 36,342, కొల్లూరులో 43,342, భట్టిప్రోలులో 41,051 మంది ఓటు హక్కును పొందినట్లు తెలిపారు. ఓట్ల పరిశీలన కోసం జాబితాలను ఆయా గ్రామాల్లోని బూతు స్థాయిలో బిఎల్ఓలకు అందజేసి నట్లు తెలిపారు. ఓట్లు నమోదు కాకపోతే మరోసారి దరఖాస్తు చేసుకుని ఓటు తిరిగి పొందవచ్చని అన్నారు.

మొక్కలు నాటేందుకు స్థలాలు పరిశీలిస్తున్న ప్రతినిధులు

పచ్చదనం కోసం చర్యలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలులో పచ్చదనం పరిచేందుకు ఆయా ప్రాంతాల్లో మొక్కలు ఏర్పాటు చేయనున్నట్లు ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు పసుపులేటి శివరామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన వంగర ప్రసాద్ ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటూ ఆదివారం గ్రామానికి విచ్చేశారు. దీంతో దేవాలయాలు, మసీదులు, పాఠశాలలు, స్మశానవాటికలు, అవసరమైన ప్రధాన రహదారుల వెంట మొక్కలు నాటేందుకు పరిశీలించారు. త్వరలో గుర్తించిన ప్రాంతాల్లో మొక్కలు నాట నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఎఫ్ఎ సభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు, వంగర ప్రసాద్ ఉన్నారు.

టిడిపి సమావేశంలో తూనుగుంట్ల సాయిబాబు

ఓటరు జాబితాపై పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం విడుదల చేసిన ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి తగిన నివేదికలు తయారు చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా సూచించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జీలు, బూతు కన్వీనర్లతో సమావేశం ఆదివానం నిర్వహించారు. సమావే శానికి వామనపల్లి కోటేశ్వరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు కుక్కల వెంకటేశ్వరరావు, సిరాజుద్దీన్, బట్టు మల్లికార్జున రావు, కనపర్తి సుందర్రావు, ఎడ్ల జయశీలరావు, ఇంతియాజ్, కంభం సుధీర్, దీపాల ప్రసాద్, మాచర్ల నాగరాజు, డోలా శివకుమార్ ఉన్నారు.

కంచర్ల రవిబాబును సన్మానిస్తున్న బార్ అసోసియేషన్

లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా 'కంచర్ల'

ప్రజాశక్తి - బాపట్ల

వైసిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కంచర్ల రవి బాబు ఆదివారం నియమితులు అయ్యారు. రవిబాబును బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సి ప్రేమ్ చంద్, విన్నకోట సత్యప్రసాద్, చెల్లా రాజు, బిల్లా స్టాన్లీ విమల్ కుమార్, బిల్లా కమల్ కుమార్, శివరామకృష్ణ, దగ్గుమల్లి బెంజి, చెల్లా అఖిల్ పాల్గొన్నారు.

చీకట్లో దళిత కుటుంబాలు

కరెంటు మీటర్ల లోపం ఆ కుటుంబాలకు శాపం

ప్రజాశక్తి - పంగులూరు

విద్యుత్ మీటర్లలో లోపం కారణంగా వేలల్లో బిల్లులు వస్తున్నాయి. సమస్య పరిష్కరించాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దీంతో ఎనిమిది నెలలుగా దళిత కుటుంబాలు చీకట్లోనే మగ్గుతున్నారు. రెండు బల్బులున్న పేదల ఇంటికి వందలాది యూనిట్లు కరెంటు వాడుకున్నట్లు రూ.వేలల్లో బిల్లులు ఇచ్చారు. దీంతో దళిత కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. బిల్లు మొత్తం కట్టాల్సిందేనన్నారు. బిల్లు కట్టకపోతే మీటర్లు తీసుకెళ్తామన్న విద్యుత్ అధికారులు మీటర్లు తీసుకెళ్లారు. మండలంలోని కోటపాడు దళిత కాలనీలో దళిత కుటుంబాలు 8నెలలుగా ఇళ్లలో కరెంటు లేక ఆరు కుటుంబాలు చీకటిలోనే బ్రతుకుతున్నారు. కాలనీకి చెందిన గొల్లపూడి అంజయ్యకు ఒక్కసారిగా రూ.34,775బిల్లు వచ్చింది. ఆ ఇంటిలో ఉన్న అంజయ్యతోపాటు ఆయన కుమారులు, కోడలు కూడా హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ ఉంటారు. ఇంటి వద్ద ఉండేది అంజయ్య భార్య బోడెమ్మ ఒక్కతే. ఆ ఇంటిలో మూడు బల్బులు, ఒక ఫ్యాను, టీవీ, ఫ్రిజ్ మాత్రమే వాడుకుంటారు. పగటిపూట బల్బులు, టీవీని ఆపేస్తారు. అయితే ఈ కుటుంబానికి రూ.34,775బిల్లు వచ్చిందని, ఆ బిల్లు కట్టలేదని కరెంట్ అధికారులు 8నెలల క్రితం కరెంటు మీటర్‌ను తీసుకువెళ్లారు. అప్పటి నుండి

కరెంటు లేక చీకట్లోనే గడుపుతున్న దళిత కుటుంబాలు

బోడెమ్మ చీకట్లోనే నివసిస్తుంది. అదే కాలనీకి చెందిన గంగవరపు రమాదేవి ఒక్కతే నివసిస్తుంది. ఆమెకు రూ.9,724బిల్లు వచ్చింది. తాను ఉండేది ఒకదానినని, రెండు బల్బులు, ఒక ఫ్యాను, టీవీ మాత్రమే తాను వాడుకుంటానని రమాదేవి చెప్పింది. కూలి పనులు చేసుకుని జీవించే తాను అంత బిల్లు కట్టలేనని చెప్పడంతో అధికారులు తన ఇంటి మీటరు తీసుకెళ్లారని అన్నారు. 8నెలలుగా తాను అంధకారంలోనే జీవిస్తున్నట్లు తెలిపారు. ఇదే కాలనీకి చెందిన గొల్లపూడి మూర్తియ్య ఇంటి కరెంట్ బిల్లు రూ.10వేలు వచ్చిందని తెలిపారు. బిల్లు కట్టలేదనే నెపంతో కరెంటు మీటరు తీసుకెళ్లారని మూర్తియ్య భార్య సుభాషిని తెలిపారు. మూర్తియ్య కుమార్తె గోళ్ళమూడి సదా చీరాలలో డిగ్రీ చదువుతున్నారు. విద్యుత్ బిల్లులు ఎక్కువ వస్తున్న కారణంగా ఆమెకు రావలసిన విద్యా దీవెన రూ.80వేలు ఆగిపోయిందని సదా తెలిపారు. 8నెలల నుండి తమ కుటుంబం కూడా అంధకారంలోనే జీవిస్తున్నట్లు తెలిపారు. అదే కాలనీలో నివాసం ఉండే గొల్లమూడి సమాధానం ఇంటి మీటర్ను కూడా అధికారులు తొలగించారు. ఆ కుటుంబం కూడా చీకట్లోనే ఉంది. అయితే తన పేరుతో కొత్త మీటరు బిగించమని రూ.2వేలు 3నెలల క్రితం సచివాలయంలో చెల్లించినట్లు తెలిపారు. ఇంత వరకు అధికారులు అదేమీ పట్టించుకోలేదని తెలిపారు. మీటర్ రాకపోవడం వలన చీకట్లోనే ఉండాల్సి వచ్చిందని తెలిపారు. ఈ కాలనీలో మరో మూడు కుటుంబాల పరిస్థితి ఇదే తరహాలు చీకట్లో ఉన్నారు. విద్యుత్ మీటర్లలో లోపం కారణంగా ఎక్కువ బిల్లులు వస్తున్నాయని అధికారులకు చెప్పినప్పటికీ అవేమీ పట్టించుకోకుండా మీటర్లు తీసుకుపోయి తమను చీకట్లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నప్పటికీ ఆచరణలో అమలు జగరడంలేదని తెలిపారు. ఇతర గ్రామాల్లోనూ ఇదే తరహాలు అధిక బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా లోపాలున్న మీటర్లు తొలగించి వాటి స్థానంలో కొత్త మీటర్లు ఇవ్వాలని, చీకటి బతుకుల్లో వెలుగు నింపాలని కోరుతున్నారు.

గుండుపల్లి వెంకటేశ్వర్లుకు నివాళి అర్పిస్తున్న కృష్ణచైతన్య

గుండుమల్లికి ఘన నివాళి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు సచివాలయం-1 కన్వీనర్ గుండు మల్లి అనిల్ కుమార్ తండ్రి గుండుమల్లి వెంకటేశ్వర్లు (80) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాప్‌నెట్ కార్పొరేషన్ ఛైర్మన్, వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణచైతన్య అతని ఇంటికి వెళ్లి వెంకటేశ్వర్లు భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి మంద సూరిబాబు, దుద్దేలా గాలెయ్య, విప్పల ముసలారెడ్డి, బత్తుల అంకమ్మరావు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన ఎపియుఎస్ కార్యవర్గం

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - బాపట్ల

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఎపియుఎస్) బాపట్ల జిల్లా శాఖ నూతన కార్యవర్గఎన్నిక ఆ శాఖ జిల్లా కార్యాలయలో ఆదివారం నిర్వహించారు. జిల్లా శాఖ నూతన అధ్యక్షులుగా చిల్లా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కుందుర్తి శ్రీనివాసరావు, కోశాధికారి కెవి రామమోహనరావు, కార్యవర్గ సభ్యులుగా డి శేషగిరిరావు, జానకిరాం, పి చక్రవర్తి, పి రవిరాం కిషోర్, డి భాస్కరమూర్తి, ఎం తిరుపతయ్య, రంగనాథ్, ఆది నారాయణ ఎన్నికయ్యారు. రాష్ట్ర కోశాధికారి మన్నవ సురేష్ కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

'ధృతరాష్ట్ర పాలనకు రోజులు దగ్గరపడ్డాయి'

ప్రజాశక్తి - బాపట్ల

కళ్ళుండి చూడలేని ధృతరాష్ట్ర వైసిపి అరాచక పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గరపడ్డాయని టిడిపి ఇన్చార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అభివృద్ధిని వెనక్కి నెట్టేసిన జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షాల అణిచివేతకు కుట్రలు పన్నుతున్నారని నరేంద్రవర్మ అన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల ఆశీస్సులతో చంద్రబాబు తిరిగి ప్రజాక్షేత్రంలో సత్తా నిరూపించుకుంటారని అన్నారు. కార్యక్రమంలో తాతా జయప్రకాశ్ నారాయణ, గొలపల శ్రీనివాసరావు, బూర్లే రామ సుబ్బారావు, పల్లం సరోజినీ, ఆంధ్రేయ పాల్గొన్నారు.

పంగులూరు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా లోకేష్ పిలుపుతో కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకొని ఆదివారం నిరసన తెలిపారు. స్థానిక బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం ముందు కార్యకర్తలు ఏడు గంటల నుండి ఏడు గంటల ఐదు నిమిషాల వరకు కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ అధ్యక్షులు బాచిన త్రివేణిబాబు మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి 50రోజులైందని అన్నారు. అనంతరం కార్యకర్తలు సైకో పోవాలి, సైకిల్ రావాలి, న్యాయం గెలవాలి, చంద్రబాబు బయటకు రావాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు, కోశాధికారి చిలుకూరి నాగేశ్వరరావు, పోతుగంటి వినాయకుడు, పోతుగంటి రాజేష్, గల్లా సుబ్బారావు, చిలుకూరి రామాంజనేయులు, పొద వీరాంజనేయులు, రాయిని

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న నరేంద్రవర్మ

బుచ్చియ్య, ఎనికపాటి సుబ్బారావు, కుర్రా వెంకట్రావు పాల్గొన్నారు.

చీరాల : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు టిడిపి ఇంచార్జి ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వానికి కళ్ళు తెరిపిద్దాం అంటూ కళ్ళకి గంతలు కట్టుకొని వివిధ చోట్ల నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు నాతాని ఉమామహేశ్వరరావు, గంజి పురుషోత్తం, కౌతరపు జనార్ధనరావు, పుట్టా దాసు, షేక్ బాషిత, షేక్ కాజుద్దీన్, షేక్ చాంద్ బాషా, షేక్ సలీం, షేక్ అబు బకర్, షేక్ కమిలి, మార్పు అశోక్, నిద్ర వెంకట సుబ్బారావు, గోలి దుర్గారావు, పంచుమర్తి శ్రీనివాసరావు, సయ్యద్ బాబు, నరాల తిరుపతి రాయుడు దగ్గుబాటి వెంకట్రావు, పల్లగొర్ల బాలసుబ్రమణ్యం, వడ్లమూడి ప్రభాస్, పులిపాటి శేఖర్, అమర్ పాల్గొన్నారు.

కారంచేడు : చంద్రబాబుకు వేసిన సంకెళ్లు బద్దలు కావాలని, నిజం గెలవాలని కోరుతూ ఎఎంసి మాజీ ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయంలో ఆదివారం రాత్రి నిరసన తెలిపారు. కళ్లకు గంతలు కట్టుకొని చంద్రబాబు కి మద్దతుగా నిజం గెలవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు కంభంపాటి నరేంద్ర, మహిళా నాయకులు పాటూరి ఆదిలక్ష్మి, యార్లగడ్డ సాయికృష్ణ, వెంకటేష్, పాతూరు శివరాం, బోడావుల గన్ను, బోడావుల శివ, పేర్ని ఆంజనేయులు, పూనాటి లక్ష్మీనారాయణ, విలేకర్ శీను, బోయిన శీను, భీముడు పాల్గొన్నారు.

వేటపాలెం : చంద్రబాబుకు వేసిన సంకెళ్లు బద్దలు కావాలని, ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని టిడిపి ఆధ్వర్యంలో మండలంలోని దేశాయిపేట పంచాయతీ ఆనుమల్లిపేటలో కళ్ళకు గంతలు కట్టుకొని వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాసిక వీరభద్రయ్య, చింత రామకృష్ణరావు, గుత్తి వీరప్రసాద్, బుద్ధి బసవచారి, బుర్రి వీరరాజ, పిచ్చుక వెంకట సుబ్బారావు, బొడ్డు రవి కుమార్, బొడ్డు సురేంద్ర, బండారు వీరాంజనేలు, పింజల వెంకట శివయ్య, బుద్ధి వెంకటేశ్వలు, బుద్ధి విజయబాబు, బుద్ధి రమేష్, బుద్ధి దుర్గా మల్లేశ్వరి, బుర్ర కవిత, దేవన విజయలక్ష్మి, వాసిక లలితాంబు, బుద్ధి కోటేశ్వరమ్మ, బుద్ధి ఉష్, బుద్ధి రాజస్వరి, బొడ్డు రవికుమార్, బుద్ధి స్వప్న పాల్గొన్నారు.

పంగులూరులో కళ్లకు గంతలు కట్టుకుని టిడిపి నిరసన

వెంకటేష్‌కు వీడియో కాల్‌లో జన్మదిన శుభాకాంక్షలు

వెంకటేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చీరాల

వైసిపి ఇన్చార్జ్ కరణం వెంకటేష్ బాబు జన్మదిన వేడుకలు స్థానిక గడియార స్థంభం సెంటర్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు ఉత్సాహంతో పట్టణంలో బాణా సంచా పేల్చి అభిమానాన్ని చాటుకున్నారు. పుట్టినరోజు వేడుకలను వెంకటేష్ హాస్పిటల్ నుండి వీడియో కాల్‌లో తన అనుచరులకు అభివాదం చేసి ఆనందాన్ని పంచుకున్నారు. అభిమానులు వీడియోకాల్‌లో వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేకును కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మల్లి వైష్ణవి, వైస్‌ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కౌన్సిలర్ బత్తుల అనీల్, కంపా అరుణ్ కుమార్, గొట్టిపాటి ఎబినేజర్, కీర్తి వెంకట్రావ్ పాల్గొన్నారు.

వేటపాలెం : వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు జన్మదిన వేడుకలు ఆదివారం గడియార స్థంభం సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, సీతమహాలక్ష్మి, ఆర్డికె ఛైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, అందే కృష్ణ, దంతం హనుమంతు, పిన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, కంచి సాంబిరెడ్డి, ఆవుల అశోక్, సాదు రాఘవ, రావన్నపేట ఉప సర్పంచ్ దంతం వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

ఒన్ టౌన్ సిఐగా శేషగిరిరావు

ప్రజాశక్తి - చీరాల

రూరల్ సిఐ ఏ మల్లికార్జునరావు తాడేపల్లికి ఆదివారం బదిలీ అయ్యారు. ప్రస్తుతం తాడేపల్లి సిఐగా విధులు నిర్వహిస్తున్న శేషగిరిరావు చీరాల ఒకటవ పట్టణ సిఐగా పోస్టింగ్ ఇస్తూ గుంటూరు రేంజ్ డీఐజీ పాల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఒకటవ పట్టణ సిఐగా పనిచేసిన మల్లికార్జునరావు మంగళగిరికి బదిలీ కావటంతో టూ టౌన్ సిఐ సోమశేఖర్ ఇన్చార్జి సిఐగా కొనసాగారు. అప్పటి నుండి ఖాళీగా ఉన్న వన్టౌన్ సిఐ పోస్టు శేషగిరిరావును నియమిస్తూ ఇత్తర్వులు ఇచ్చారు.

నూతన సిఐ శేషగిరిరావు

బటన్ నొక్కడం కాదు.. భవిష్యత్తు చూపాలి

ప్రజాశక్తి - అద్దంకి

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో నియోజక వర్గంలో 16వ రోజు సైకిల్ యాత్ర ఆదివారం మండలంలోని ధర్మవరం నుండి ప్రారంభించారు. స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రారంభమై సైకిల్ యాత్ర శంఖవరప్పాడు మీదుగా సాగింది. గ్రామంలోకి హారతులతో మహిళలు ఘనస్వాగతం పలికారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలవకూరు గ్రామం శివారులో మేరిమాత విగ్రహానికి నివాళులు అర్పించారు. బొమ్మనంపాడు వరకు సైకిల్ యాత్ర కొనసాగించారు. అక్కడ అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద చంద్రబాబు విడుదల కావాలని ప్రత్యేక పూజలు

సైకిల్ యాత్రలో ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

నిర్వహించారు. అనంతరం ఎస్సీ కాలనీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలను చైతన్య పరుస్తూ వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ స్థానిక ప్రజల సమస్యలు వింటూ 10.5కిలో మీటర్లు సైకిల్ యాత్ర చేశారు.

కనీస పెన్షను రూ.9 వేలు ఇవ్వాలి

ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఇఎఎఫ్ పెన్షనుదార్లకు నెలవారీ కనీస పెన్షను రూ.9 వేలుగా నిర్ణయించాలని, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనుదార్లకు 1వ తేదీన పెన్షను ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఆల్ పెన్షనర్స్, విశ్రాంత పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఎ. శాస్త్రి డిమాండ్ చేశారు. ఒంగోలు పివిఆర్ బాలికోన్నత పాఠశాలలో ఆల్ పెన్షనర్స్, విశ్రాంత పెన్సర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు జి.శేషయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కనీస పెన్షను 9 వేలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ తీర్మానాలను ఆమోదించారు. సంఘ ప్రధాన కార్యదర్శి రాంబాబు గత సంవత్సర శాఖ కార్యదర్శి నివేదిక, ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. సభ్యులు నివేదికపై జరిగిన చర్చలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్.ఎ. శాస్త్రి మాట్లాడుతూ ఏ పెన్షన్ లేని అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు వంటి లక్షలాది మందికి ప్రతి నెల కనీస పెన్షను వర్తింప చేయాలన్నారు. అనంతరం టి.గోపాల్ రెడ్డి, ఎవి. పుల్లారావు, పి.పేరయ్య, సోదర సంఘాల బాధ్యులు సుబ్బారావు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆల్ పెన్షనర్స్ విశ్రాంత పర్సన్ అసోసియేషన్ జిల్లా కొత్త కమిటీని, ఒంగోలు ట్రెజరీ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా శాఖ అధ్యక్షులుగా జి.శేషయ్య, సిహెచ్.రాంబాబు, ట్రెజరీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా జి.అంజయ్య, వై.రామారావు, గౌరవాధ్యక్షుడిగా టివిఆర్.సుబ్బారావును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆల్ పెన్షనర్స్ విశ్రాంత పర్సన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఎ శాస్త్రి

'రాళ్లవాగు'లో రాబందులు

- యథేచ్ఛగా ఆక్రమణ
- వాగులో ఏర్పడిన గుంతలు
- 77.31 ఎకరాలకు మిగిలింది 30 ఎకరాలే
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం గ్రామానికి ఉత్తరం వైపున రాళ్లవాగుకు ఉంది. వాగుకు ఇరువైపుల ఉన్న పోరంబోకు భూమిని కొంత మంది ఆక్రమించి విక్రయాలు జరుపుతున్నారు. వారిలో వారికే వివాదం ఏర్పడింది. దీంతో రాళ్లవాగు హద్దు పూర్వం నుంచి తమ పెద్దలు సంపాదించారని చెబుతున్నారు. పట్టా భూమి పక్కన వాగు భూములను ఆక్రమించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

యర్రగొండపాలెం నుంచి గంజివారిపల్లె రోడ్డులో ఉన్న చప్టా వద్ద నుంచి మురారిపల్లె పెద్ద చెరువు వరకూ నాలుగు సర్వే నెంబర్లలో సుమారు 77 ఎకరాల 31 సెంట్ల వాగు పోరంబోకు భూమి ఉంది. సర్వే నెంబర్ల వారీగా 28/1లో 44.09 ఎకరాలు, 587/2లో 22.04, 588/1లో 5.62, 588/4లో 5.56 ఎకరాల భూమి ఉంది. ఆక్రమణదారులు రాళ్లవాగుకు ఇరు వైపులా ఆక్రమించారు. దీంతో వాగు కుంచించుక పోయింది. 30 ఎకరాలు మాత్రమే రాళ్లవాగు కాలువ దర్శనమిస్తోంది. ప్రభుత్వ అనుమతి లేకుండానే భవన నిర్మాణాలు చేపడుతున్నారు. వాగులో గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. దీంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. వాటిలో పడి పశువులు మతి చెందుతున్న ఘ1టనలు చోటు చేసుకుంటున్నాయి. ఆక్రమదారుల నుంచి రాళ్లవాగు భూములను కొనుగోలు చేస్తున్న వారు నష్టపోతున్నారు.



స్పందించని అధికారులు..

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాల్సిన రెవెన్యూ అధికారులు కళ్ల ముందే లక్షలు విలువ చేసే వాగు పోరంబోకు భూములు కబ్జాకు గురవుతున్నాయి. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి రక్షించాల్సింది పోయి రాజకీయ బత్తిళ్లకు తలొగ్గి కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆక్రమణదారులకు నోటీసులిచ్చాం

ఈదుల రాజశేఖర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి, యర్రగొండపాలెం

ఆక్రమణలు వాస్తవం. ఆక్రమణల తొలగింపుపై తమకు ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చాం. రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారుల సహకారం ఉంటేనే ఆక్రమణల తొలగింపు సాధ్యమవుతుంది.

ప్రకాశాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-పామూరు

వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో పంటలు సాగు కాలేదేని, అరకొరగా సాగు చేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రకాశాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం మండల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి షేక్ మీరావలి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ రైతులు వరి, మిర్చి, కంది, మినుము, పొగాకు తదితర పంటలకు పెట్టుబడులు పెట్టి వర్షాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. వేలకు వేలు ఖర్చు చేసి చివరకూ ఎండుతున్న పంటలను చూసి ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారులు పంటలు పరిశీలించి ఈ క్రాప్ నమోదు చేయాలన్నారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో తీవ్రమైన నీటి ఎద్దడి రాబోతోందని, యుద్ధ ప్రాతిపదికగా నీటి ఎద్దడిని నివారించేందుకు ముందస్తు నిధులు, ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు పనులు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లావ్యాప్త ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కొమ్మాలపాటి మాల్యాద్రి, షేక్ నాయభా, షేక్ గులాం రసూల్, ఎం.మాలకొండయ్య, డి.కొండమ్మ, సిహెచ్ .వెంకటేశ్వర్లు, నరసయ్య, నరసింహారావు, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్